

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 227 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం, 17, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# జర్నలిస్టులపై.. జబర్దస్తీ!



- జర్నలిస్టుల హక్కులను అణిచివేసే కుట్రలు జరుగుతున్నాయి
- అసాంఘిక శక్తుల ఆగడాలు పెరిగిపోతున్నాయి
- అవినీతి సంపాదకుల వివరాలకు లెక్కలు లేవు
- సుప్రీం కోర్ట్ ఆదేశాలను ధిక్కరిస్తున్న అసాంఘిక శక్తులు
- అధికారం ముసుగులో జర్నలిస్టులను అణిచివేయడం ఎవ్వని తరం కాదు
- చట్టాలను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వ అధికారులు
- జర్నలిస్టుల వృత్తి బాధ్యతలపై అవినీతిపరుల కన్ను బడుతుంది
- అవినీతిపరులకు సహకరిస్తే ఓకే లేదంటే దాడులే
- ప్రభుత్వాలను అధికారులను ప్రశ్నించడం నిలదీయడం జర్నలిస్టుల హక్కు
- జర్నలిస్టులు చేసే పనులు అసాంఘిక శక్తులు చేస్తానంటే ఎలా
- అవినీతిపరులంతా ఒకరికి ఒకరు సహకరించుకుంటున్నరు

డాక్టర్ బరిగెల శివ



తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులపై అణిచివేత, బెదిరింపులు పెరుగుతున్నాయని డాక్టర్ బరిగెల శివ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల తరపున ప్రశ్నించే జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అవినీతి శక్తులు, కొందరు అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడం జర్నలిస్టుల రాజ్యాంగబద్ధమైన హక్కని స్పష్టం చేశారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు చట్టాలను మరింత బలోపేతం చేయాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను అరికట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2








## గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

నీటిని మళ్లించి జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటాం

ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కెసిఆర్ డబ్బులు వృధా

సీతారామ ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన మంత్రులు

ఖజనాపై భారం మోపారన్న డిప్యూటి సిఎం భట్టి

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై16(జై భీమ్ న్యూస్):**



గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి

- మిగతా 2లో..

## కర్ర నరసింహారెడ్డి కుటుంబానికి పరామర్శ



మృతుని నివాసానికి వెళ్లిన డాక్టర్ బరిగెల శివ

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన జై భీమ్ టీవీ వ్యవస్థాపకుడు

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వశపాక ఎల్లన్న పాల్గొన్నారు

కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన నాయకులు

మృతునికి నివాళులర్పించిన గ్రామ పెద్దలు, స్థానికులు

**రాయపర్తి, జూలై16(జై భీమ్ న్యూస్) :**

రాయపర్తి మండలం తీర్మాలయాపల్లి గ్రామానికి చెందిన కర్ర నరసింహారెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే జై భీమ్ టీవీ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వశపాక ఎల్లన్నతో కలిసి మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కర్ర నరసింహారెడ్డి మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన డాక్టర్ బరిగెల శివ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారి ఆత్మీయులను ఓదార్చారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనో ధైర్యాన్ని ఆ కుటుంబానికి భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి కర్ర నరసింహారెడ్డికి నివాళులర్పించారు.

## వికలాంగ విద్యార్థుల సంక్షేమమే తొలి ప్రాధాన్యం

దివ్యాంగుల కార్యాలయం, వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ

సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

2



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# వికలాంగ విద్యార్థుల సంక్షేమమే తొలి ప్రాధాన్యం

**దివ్యాంగుల కార్యాలయం, వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ**
**సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**



**హైదరాబాద్,జూలై16(జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం, వారి విద్యాభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదలే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం నల్లగొండ ఎక్స్‌రోడ్స్‌లోని దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం, ప్రభుత్వ దివ్యాంగుల వసతి గృహం, పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మమేకమైన మంత్రి, మూగ,చెవిటి విద్యార్థులు సంకేత భాష ద్వారా తమ సమస్యలను వివరించగా ఎంతో శ్రద్ధగా ఆలకించారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల అవసరాలన్నింటినీ సమగ్ర ప్రతిపాదనల రూపంలో ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి తీవ్రంగా పరిగణించారు. ఖాళీ పోస్టుల వివరాలు, అవసరమైన బోధనా సిబ్బంది, ఇతర సౌకర్యాలపై వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సహాయ సంచాలకుడు, విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దివ్యాంగ విద్యార్థుల విషయంలో విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు అనే మూడు అంశాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని ఆహారం, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, తరగతి గదులు, బోధన సౌకర్యాలు, విద్యార్థుల భద్రత వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, సంక్షేమ పథకాల సమర్థ అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి దివ్యాంగ విద్యార్థికి నాణ్యమైన విద్య, మెరుగైన వసతి, అవసరమైన సౌకర్యాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి సమస్యను మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా ప్రభుత్వానికి పంపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

మొదటి పేజీ తరువాయి

తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట్ స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీ-డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీ-డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమీషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్‌ను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కొనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట్ కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# జర్నలిస్టులపై జబర్దస్తీ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టుల అణిచివేత ఎక్కువైపోతుందని డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి పలురకాల ప్రయోజనాలు కల్పిస్తున్నామని ప్రకటిస్తున్న ప్రభుత్వాలు అత్యంత హీనంగా అవమానపరుస్తుండడమే కాకుండా ఊహించిన దానికన్నా ఎక్కువగా అణిచివేతను ప్రదర్శిస్తున్నారని హెచ్చరించారు.ప్రజా క్షేత్రంలో సామాన్య ప్రజల తరఫున శక్తి వంచన లేకుండా ప్రజాభివృద్ధి కోసం పాటుపడుతున్న జర్నలిస్టులపై ప్రభుత్వాల ధోరణి పూర్తిగా మారాల్సిందేనట్టు సూచించారు.ఒకవైపు వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్స్ కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్న ప్రభుత్వాలు జర్నలిస్టులపై కరుడుగట్టిన కక్ష సాధింపులను ప్రదర్శిస్తున్నారని తెలుగు ప్రజలు పెద్ద ఎత్తున హెచ్చరిస్తున్నట్లు తెలిపారు.వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని బేరీజు వేసినప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎవరైతే ఎక్కువ అవినీతికి అక్రమాలకు పాల్పడతారో వాళ్లే జర్నలిస్టులపై అక్రమ దాడులకు పాల్పడుతున్నారని ఈ సందర్భంగా హెచ్చరించారు.ప్రభుత్వాలను సూటిగా ప్రశ్నిస్తున్న సందర్భాలలో ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులు తట్టుకోలేకపోతున్నారని వాళ్లను నిలదీసే క్రమం రాజకీయ నాయకులకు నచ్చడం లేదంటూ బాహాటంగా గుర్తుచేశారు.ప్రజల తరఫున ప్రత్యుత్తరవాదులుగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు జాతి వివక్షతలతో పాటు కలం వివక్షతను తట్టుకొని నిలబడడం అనేది సాధ్యమైన పని కానప్పటికీ సమాజాన్ని ప్రభావితం చేయడంలో ప్రజల పక్షాన ధైర్యంగా నిలబడడంలో ప్రభుత్వ ఆస్తులను గాని ప్రభుత్వ వ్యవస్థలను కాపాడడంలో గాని జర్నలిస్టులు ప్రదర్శిస్తున్న ధైర్య సాహసాలను ప్రభుత్వాలే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న అవినీతి అధికారులు అక్రమాలకు పాల్పడుతున్న అధికారులులు ఏమాత్రం తట్టుకోలేకపోతున్నారని తీవ్రంగా మండిపడ్డారు.ప్రజలను అభివృద్ధి పేరు మీద మభ్యపెడుతూ ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వాలను ప్రశ్నించలేని సమర్థులందరూ దద్దమ్మలైపోయారని ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్న మేధావులు ఉద్యమకారులు ప్రజాసంఘాలు జర్నలిస్టులు అణిచివేతను అనుభవిస్తున్నారని ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసినా అవినీతిపరుల పక్షాన అక్రమార్కుల పక్షాన భూకబ్జాదారుల పక్షాన నిలబడుతున్నటువంటి కొంతమంది పోలీసుల వ్యవహారం రాష్ట్ర శాంతి భద్రతలపై తీవ్రమైన ప్రభావాన్ని తీసుకువస్తుందని హెచ్చరించారు.

**మనోభావాల మోజులో మనీ సంపాదన..**

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా ప్రభుత్వ అధికారులు అధికార హోదాను అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా అవినీతి సంపాదన సంపాదించుకుంటూ అక్రమ సంపాదన సంపాదించుకుంటూ అవినీతి నిరోధక శాఖలకు పట్టుపడుతూ పాడుపడ్డ ఆస్తులన్నీ సంపాదించుకొని ఏమీ తెలియనట్లుగా అవినీతి విశ్వగురువుల ప్రదర్శనను ప్రదర్శిస్తున్నట్లు తెలుగు రాష్ట్రాల ప్రజలు చీకొడుతున్నట్లు గుర్తు చేశారు.అవినీతిపరులకు అక్రమార్కులకు మనోభావాలు దెబ్బతింటాయి అనే విషయం కొంతమంది పోలీసు అధికారులు వాళ్ళ పక్షాన నిలబడుతూ నిజాయితీపరులపై అవమానాలతో కూడిన దాడులను చేసే వరకు ఇటు సమాజానికి అటు నిజాయితీపరులకు తెలియడం లేదన్నారు.అవినీతిపరుల ఏమో ఆదర్శవంతులుగా వెలుగొందుతుండగా అక్రమార్కులంతా అవినీతి ఆదర్శపరులకు ఆప్తులుగా వెలుగొందుతున్నారని పేర్కొన్నారు.స్వయంగా దేశ ప్రధానిపై సోషల్ మీడియాలో భయంకరమైన నిజాలు వెళ్లడవుతుండగా దేశంలో అత్యంత విలువైన అత్యున్నత న్యాయస్థానం సోషల్ మీడియా వైపు సహకారంగా నిలబడుతుండడం దేశ ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారని అన్నారు.దేశంలో దేవుళ్ళ సొమ్మును దొంగిలించడం మరోవైపు ప్రభుత్వాలు ప్రజల సొమ్మును దొంగిలించడం ఇంకోవైపు ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లోని సొమ్మును దొంగిలించడం అన్ని తెలిసే జరుగుతున్నాయని వాటన్నిటిని ప్రజాక్షేత్రంలో ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం కోసం తీవ్రంగా శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులపై ఎప్పటికప్పుడు ఒత్తిడితో కూడిన మానసిక దాడులు ఒత్తిళ్లతో కూడిన బలవంతపు దాడులు పెరిగిపోతూనే ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఎవరు అవినీతిపరులో ఎవరు అక్రమార్కులో ఎవరు సమాజం కొరకు పని చేస్తున్నారో కనీసం తెలుసుకోలేనంత దుర్మార్గపు స్థితికి వ్యవస్థలు దిగజారిపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు.ప్రజలకు మేలు చేయలేని ప్రభుత్వాలు ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాలు ప్రజలకు సహాయపడాలనే సోయలేని ప్రభుత్వ కార్యాలయాలు జర్నలిస్టులపై ఉరుకులాడడానికి మాత్రం తెగ గావరపడుతున్నారని హెచ్చరించారు.ప్రజలను మోసగించి ప్రభుత్వ వ్యవస్థలను మోసగించి అధికారపు అహంకారంతో అక్రమంగా అవినీతిపరంగా సంపాదించుకొని సమాజంలో సాటిలేని వ్యక్తులుగా చలామణి కావాలనుకోవడం అధికారం ఉన్నంతవరకు తిరుగు లేకపోవచ్చు కానీ కాలం దెబ్బ కొట్టినప్పుడు పది కాలాల ఫలితాన్ని అనుభవించక తప్పదన్న సంగతిని మర్చిపోవద్దన్నారు.ఏ ప్రభుత్వాధికారైనా ఏ ప్రజా ప్రతినిధైన ప్రజలకు న్యాయం చేయడానికి మాత్రమే తాపత్రయపడాలి గాని అందినంత దోచుకోవడం అందని దానికోసం తాపత్రయపడుతూ, ప్రయాసపడుతూ అక్రమంగానైనా సంపాదించడం లక్ష్యంగా పెట్టుకోవడమే తెలుగు రాష్ట్రాల అభివృద్ధి తెలుగు రాష్ట్రాల ఉనికి తెలుగు రాష్ట్రాల సంపద పూర్తిగా అవినీతి అక్రమార్కుల ధారాధత్తమైపోతుందని హెచ్చరించారు.ప్రభుత్వ అధికారుల కైనా ప్రజాప్రతినిధుల కైనా ప్రజాక్షేత్రంలో అధికార హోదాలో కొనసాగుతున్న సందర్భాల్లో వ్యక్తిగత మనోభావాలు అనేవి ఏమాత్రం ఉండవని ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థలకు వ్యతిరేక పనులు చేస్తున్న వాళ్లపై ప్రతి ఒక్కరు ప్రశ్నించే హక్కును కలిగి ఉంటారని అలాంటి వ్యక్తులను ప్రశ్నిస్తున్న సందర్భంలో మనోభావాలు దెబ్బతింటున్నాయంటూ దగుల్బాజీ మాటలు మాట్లాడడం ప్రశ్నిస్తున్న వ్యక్తులపై అరాచక శక్తులతో అన్ని విధాల దాడులను ప్రయోగించడం మూర్ఖపు స్వభావం కలిగిన వ్యక్తులు చేసే పనులంటూ ఈ సందర్భంగా హెచ్చరించారు.తెలుగు రాష్ట్రాల్లో ఎవరైతే ఎక్కువగా అవినీతి సొమ్మును సంపాదించుకుంటారో వాళ్లంతా ఈ మధ్యకాలంలో జర్నలిజం అనే పవిత్రమైన వృత్తిపై నకిలీ రాయుల్లుగా వాలిపోతూ సమాజం పట్ల జర్నలిజాన్ని దిగజార్చే ప్రయత్నాలు చేస్తున్నారని హెచ్చరించారు.కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నైతే ఉద్యోగ నియమాలకు ఉద్యోగ చట్టాలకు పూర్తి విరుద్ధమైన కార్యకలాపాలు చేపడుతూ ప్రభుత్వ సొమ్మును పందికొక్కుల మేసే వ్యక్తులందరూ అధికార హోదాలో తిరుగులేని సంపాదనకు బానిసలు అవుతున్నారని వాళ్ళందరినీ పోలీసు వ్యవస్థతో పాటు చట్టం న్యాయస్థానాలు ప్రభుత్వాలు ఏమాత్రం గుర్తించడం లేదంటూ, పట్టించుకోవడం లేదంటూ సూటిగా నిలదీసారు.అలాంటి వ్యక్తులపై అలాంటి అధికారులపై అలాంటి అరాచక శక్తులపై ఎప్పటికప్పుడు సమాచారాలను సేకరిస్తూ ప్రజాక్షేత్రంలో వాళ్లందర్నీ అవినీతిపరులుగా అక్రమార్కులుగా ప్రజా వ్యతిరేక శక్తులుగా ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెట్టడం కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తూ ఒంటరి పోరాటాలు చేస్తున్న జర్నలిస్టుల బతుకులపై దాడులకు పాల్పడుతున్న వాళ్లందర్నీ కఠినంగా శిక్షించే చట్టాలను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు రూపొందించాలని పేర్కొన్నారు.ప్రజా ప్రతినిధుల పాలనపై గాని ప్రభుత్వ వ్యవస్థల ఆగడాలపై గాని ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న అధికారుల పట్ల గాని వాళ్ళు కొనసాగిస్తున్న అవినీతి అక్రమాల పట్ల గాని వర్కింగ్ జర్నలిస్టులు తీవ్ర స్థాయిలో పోరాటాలు చేస్తున్న సందర్భంలో నిజనిర్ధారణ తెలుసుకోకుండా అబండాలు వేయడం మానుకొని జర్నలిస్టు రాస్తున్న వార్తలపై అభ్యంతరాలు ఉంటే తక్షణమే ఖండించుకొని వాళ్లకు ఉన్నటువంటి నిజాయితీని వాళ్లకున్న నిబద్ధతను ప్రభుత్వ వ్యవస్థల పట్ల వాళ్లకు ఉన్నటువంటి అభిప్రాయాలను ఆధారాలతో ఖండిస్తూ ప్రజాక్షేత్రంలో నిజాయితీని కనపరచుకునే హక్కులు ఉన్నాయన్నది మర్చిపోయి ప్రజల మధ్యకు వస్తే వాళ్ల అవినీతి అక్రమ భాగోతాలు బయటపడగలవేమోనని భావిస్తూ అడ్డదారి మార్గంలో ప్రశ్నిస్తున్న వ్యక్తులను అణిచివేయాలని చూడడం అవినీతి అక్రమార్కుల జాడకు సరిగ్గా సరితూగుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పోలీసు వ్యవస్థను బలపరుస్తున్నామని సమాజానికి గర్వంతో కూడిన సాంకేతాన్ని తెలుపుతున్న పోలీస్ ఉన్నత వర్గాలు అవినీతి అక్రమార్కులను వదిలేస్తూ ప్రజా సొమ్మును హవాలాగా దోచుకుంటున్న వ్యక్తులను పక్కన పెడుతూ కరుడుగట్టిన నేరస్తుల కరుడుగట్టిన భూకబ్జాదారుల కరుడుగట్టిన అవినీతిపరుల మనోభావాలు దెబ్బతింటున్నాయి అంటూ వర్కింగ్ జర్నలిస్టులపై విరుచుకుపడడం ఇరు రాష్ట్రాల పోలీసు ఉన్నత వర్గాలు ఇకనైనా గమనించాలని కోరారు.సామాన్య ప్రజలను అణిచివేసినంతమాత్రాన సాధారణ వర్కింగ్ జర్నలిస్టులను కట్టడి చేసినంత మాత్రాన అవినీతి అక్రమాలు అంతరించబడవని ప్రభుత్వ వ్యవస్థలను సర్వనాశనం చేస్తూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ రాష్ట్ర ప్రజల మనోభావాలపై రాష్ట్ర ప్రజల ఆస్తులపై ప్రభుత్వ వ్యవస్థల నిధులపై దాడులు చేస్తున్న అక్రమ ముఠాలను అంతరించే పనిలో నిమగ్నమైతే తప్ప ఇరు రాష్ట్రాలు శాంతి భద్రతల లక్ష్యాలకు చేరువ కాలేవన్నది పోలీస్ ఉన్నత వర్గాలు గమనించాలని కోరారు.ప్రభుత్వాల అణిచివేతను ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అవినీతి అక్రమార్కుల తరఫున అణిచివేతను బాధ్యతగా తీసుకుంటున్న కొంతమంది పోలీసు అధికారులు ఈ మధ్యకాలంలో పలురకాల కేసులలో ఇరుక్కుని కరుడుగట్టిన నేరస్తులుగా గుర్తించబడుతూ పోలీస్ వ్యవస్థకు ఎంతటి చెడి పేరును తీసుకువస్తున్నారో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఉందన్నారు.అధికారం ఉంది కదా అని ఏది చేసినా చెల్లువాటవుతుందిలే అనుకోవడం సరైనది కాదంటూ ఇరు రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారుల ఆలోచనలకు సూచనలకు కార్యాచరణలకు అనుకూలంగా పోలీసు వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత కిందిస్థాయి పోలీస్ అధికారులపై ఎంతగానో ఉంటుందని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజలను రక్షిస్తున్నామని పై అధికారులకు తెలుపుతూ ప్రజల అణిచివేతను ఉన్నత అధికారుల దృష్టికి తెలియనీయకుండా చేసే ప్రయత్నం ఏదైతే ఉందో ప్రతి జిల్లాలోని పోలీస్ ఉన్నత వర్గాలు అత్యంత సూక్ష్మంగా పసుగట్టాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.ఏది చేసైనా వర్కింగ్ జర్నలిస్టులను అణచివేస్తే తప్ప అవినీతి సంపాదనను అక్రమ సంపాదనను దాచుకోలేమనే భ్రమలో ఎవరైనా ఉన్నట్లయితే అది కొంతకాలం మట్టికేనని పదవులు పోయాక అక్రమంగా సంపాదిస్తున్న పైస సంపాదన ఒక్క దెబ్బతో వెలుగులోకి వచ్చే ఆస్కారాలు ఉంటాయని అలాంటి వారిని గమనిస్తూ అధికార హోదాలో కొనసాగాలనే ఆలోచనలు ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు.ప్రజల మనోభావాలకు ప్రభుత్వ కార్యాలయాల మనోభావాలకు అనుగుణంగా పనిచేసే ప్రజాప్రతినిధులను గాని అధికారులను గాని వర్కింగ్ జర్నలిస్టులు ఎంతో గౌరవిస్తారని అదే సందర్భంలో అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారుల పట్ల వర్కింగ్ జర్నలిస్టులు అంతే స్థాయిలో విరుచుకుపడతారన్న సంగతిని పక్కాగా గుర్తించుకోవాలని హెచ్చరించారు.అవినీతిని అంతరించడానికి అక్రమాలను నిర్మూలించడానికి కులాలతో గాని మతాలతో గాని జాతులతో గాని అధికార హోదాలతో గాని సరిపోల్చి చూడకూడదని ప్రతిచోట అత్యంత ఘోరంగా అవినీతిలో ఇరుక్కుపోయిన అక్రమాల దారిలో ఇరుక్కుపోయిన తెలుగు రాష్ట్రాలను రక్షించుకోవడం కోసం వర్కింగ్ జర్నలిస్టులతో పాటు నిజాయితీ కలిగిన ప్రభుత్వ అధికారులు నిజాయితీ గలిగిన ప్రజాప్రతినిధులు కంకణ బద్ధులై జీవించాలని కోరినారు.

# ఆస్తి కోసం వృద్ధ దంపతుల వేధింపుల ఆరోపణ

**కన్నబిడ్డలే మానసిక, శారీరకంగా వేధిస్తున్నారని బాధితుల ఆవేదన**

**హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా చర్యలు తీసుకోలేదని పోలీసులపై ఆరోపణ**

**ఫిర్యాదులపై స్పందించకపోవడంతో వేధింపులు కొనసాగుతున్నాయని వేదన**

**ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రక్షణ కల్పించాలని విజ్ఞప్తి**

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**జమ్మికుంట, జులై 16 (జై భీమ్ న్యూస్) :**

ఆస్తి కోసం కన్నబిడ్డలే తమను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని ఓ వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పేరుపై ఉన్న ఆస్తిని బలవంతంగా రాయించుకోవాలనే ఉద్దేశంతో బెదిరింపులు, దుర్భాషలు, అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు జమ్మికుంట పోలీసులను ఆశ్రయించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, హైకోర్టు ఉత్తర్వుల ప్రతులను సమర్పించినా సంబంధిత అధికారులు స్పందించలేదని, కేసును ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసు అధికారులే హైకోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడం ఆందోళనకరమని, దీంతో నిందితులు మరింత రెచ్చిపోయి వేధింపులను కొనసాగిస్తున్నారని తెలిపారు. వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన కన్నబిడ్డలే ఆస్తి కోసం హింసిస్తుండగా, న్యాయం చేయాల్సిన అధికారులు కూడా స్పందించకపోవడం మరింత బాధాకరమని వాపోయారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత వృద్ధ దంపతులకు పూర్తి రక్షణ కల్పించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.



# అణచివేత నుంచి సాధికారత వైపు

**పి. మహేంద్రనాథ్ చెరగని ప్రస్థానం**
**దళిత, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి**
**విద్య, భూమి హక్కులు, సంక్షేమమే సామాజిక సాధికారతకు పునాదిగా అడుగులు**
**1976లో సంక్షేమ విధానాలకు కొత్త దిశ.. ప్రభుత్వ ఉత్తర్వుల అమలులో ప్రత్యేక చొరవ**
**పాలమూరు ప్రాంత సామాజిక చరిత్రలో ప్రజానాయకుడిగా ప్రత్యేక స్థానం**

**పాలమూరు, 16 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

అణచివేత, సామాజిక వివక్ష, భూస్వామ్య ఆధిపత్యం బలంగా వేళ్లూనుకున్న కాలంలో దళితులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడుతూ వారి జీవితాల్లో సాధికారతకు బాటలు వేసిన నాయకుడిగా పి. మహేంద్రనాథ్ పాలమూరు ప్రాంత చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించారు. విద్య, భూమి హక్కులు, సంక్షేమం, చట్టపరమైన అవగాహన ద్వారానే అణగారిన ప్రజల జీవితాల్లో శాశ్వతమైన మార్పు సాధ్యమని విశ్వసించిన ఆయన, సామాజిక న్యాయాన్ని కేవలం నినాదాలకు పరిమితం చేయకుండా ఆచరణలో చూపిన నేతగా గుర్తింపు పొందారు. 1926 జూన్ 10న జొన్నలబొగూడ గ్రామంలో జన్మించిన పి. మహేంద్రనాథ్ చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి కనబరిచారు. అప్పటి సామాజిక పరిస్థితుల్లో అణగారిన వర్గాలకు విద్య అందుకోవడమే పెద్ద సవాలుగా ఉన్నప్పటికీ ఆయన ప్రతిభను గుర్తించిన జమీందారు చిక్కపల్లి రామచంద్రారావు విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించినట్లు ఆయన జీవితానికి సంబంధించిన వివరాలు పేర్కొంటున్నాయి. అనంతరం మహేంద్రనాథ్ తన విద్య, మేధస్సు, సామాజిక స్పృహను ప్రజల సమస్యల పరిష్కారానికి ఉపయోగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ అప్పటి పాలమూరు ప్రాంతంలోని అనేక గ్రామాల్లో భూస్వామ్య వ్యవస్థ ప్రభావం కొనసాగేది. దళితులు, పేదలు, అణగారిన వర్గాలు సామాజిక వివక్షతో పాటు ఆర్థిక అసమానతలతో సతమతమయ్యేవారు. అలాంటి పరిస్థితుల్లో మహేంద్రనాథ్ ప్రజలకు అండగా నిలిచారు. తమ సమస్యలను చెప్పుకునేందుకు మారుమూల గ్రామాల నుంచి పేద ప్రజలు 'సద్ది మూటలు' కట్టుకుని మైళ్ల దూరం ప్రయాణించి ఆయన వద్దకు వచ్చేవారని చెబుతారు. వారి సమస్యలను వినడమే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన వినతిపత్రాలు, దరఖాస్తులను సిద్ధం చేయడం, అధికారులను సంప్రదించడం, చట్టపరంగా వారికి అందాల్సిన హక్కుల కోసం కృషి చేయడంలో మహేంద్రనాథ్ ముందుండేవారు. ముఖ్యంగా మిగులు భూములు, కౌలు భూములు, భూ హక్కులకు సంబంధించిన వివాదాల పరిష్కారంలో పేదలకు అండగా నిలిచారు. భూమి పేదవాడికి కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది ఆర్థిక స్వాతంత్ర్యానికి, ఆత్మగౌరవానికి పునాది అని ఆయన విశ్వసించేవారు. విద్య ద్వారానే సామాజిక అసమానతలను అధిగమించవచ్చని భావించిన మహేంద్రనాథ్ 1949లోనే కులాలకు అతీతంగా పేద విద్యార్థులకు వసతి కల్పించే హాస్టల్ ఏర్పాటుకు చొరవ చూపినట్లు ఆయన జీవిత చరిత్రకు సంబంధించిన వివరాలు చెబుతున్నాయి. కుల వివక్ష తీవ్రంగా ఉన్న కాలంలో అన్ని వర్గాల పేద విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించాలనే ఆలోచన అప్పట్లో ఒక విప్లవాత్మక సామాజిక ప్రయోగంగా నిలిచింది. రాజకీయ రంగంలోకి ప్రవేశించిన అనంతరం కూడా మహేంద్రనాథ్ తన సామాజిక లక్ష్యాలను విడిచిపెట్టలేదు. హరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి సంబంధించిన అనేక అంశాలను ప్రభుత్వ విధానాల్లో భాగం చేసేందుకు కృషి చేశారు. 1976 ఏప్రిల్‌లో జరిగిన ఒక కీలక సమావేశంలో మేధావులు, సామాజిక వర్గాల ప్రతినిధుల నుంచి వచ్చిన 322 సిఫార్సుల్లో 224 అంశాలను తీర్మానాలుగా ఆమోదించినట్లు చారిత్రక వివరాలు పేర్కొంటున్నాయి. వీటిలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని కీలక అంశాలను అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాలు కేవలం సమావేశ తీర్మానాలుగానే మిగిలిపోకుండా వాటిని ప్రభుత్వ ఉత్తర్వుల రూపంలో అమల్లోకి తీసుకురావడానికి మహేంద్రనాథ్ విశేష చొరవ చూపారు. ఈ క్రమంలో ఒకేసారి 100 ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి చర్యలు తీసుకున్నట్లు ఆయన రాజకీయ ప్రస్థానానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్నాయి. సామాజిక సమస్యలపై వచ్చిన సూచనలను ప్రభుత్వ విధానాలుగా మార్చేందుకు ఆయన చూపిన పరిపాలనా దక్షత అప్పట్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. దళితులు, అణగారిన వర్గాల హక్కుల కోసం బలంగా పోరాడినప్పటికీ ఇతర సామాజిక వర్గాల పట్ల ద్వేషాన్ని ప్రోత్సహించకపోవడం మహేంద్రనాథ్ నాయకత్వంలోని ప్రత్యేకతగా చెబుతారు. "ఇతర వర్గాలను ద్వేషించకుండానే ఒక వర్గాన్ని ప్రేమించవచ్చు" అనే భావనతో ఆయన రాజకీయ, సామాజిక ప్రయాణం సాగిందని ఆయన సన్నిహితులు పేర్కొంటారు. పి. సుదర్శన్‌రావు, పాలం సుబ్బయ్య వంటి అనేకమంది సహచరులతో సమన్వయంతో పనిచేస్తూ సామాజిక న్యాయం,



సమైక్యత రెండింటినీ ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పి.వి. నరసింహారావు, జలగం వెంగళరావు, ఎన్.టి. రామారావు వంటి భిన్నమైన ముఖ్యమంత్రుల కాలంలోనూ మహేంద్రనాథ్ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సమయంలో ముఖ్యమంత్రి పదవికి మహేంద్రనాథ్ పేరును కూడా పార్టీ అధిష్ఠానం పరిశీలించినట్లు అప్పటి 'జమీన్ రైతు' పత్రికలో కథనం వెలువడినట్లు ఆయన జీవిత విశేషాల్లో పేర్కొనబడింది. ముఖ్యంగా అచ్చంపేట వంటి మారుమూల అటవీ ప్రాంతాల్లో విద్య, సంక్షేమ అవకాశాల విస్తరణకు మహేంద్రనాథ్ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థలు, పారిశ్రామిక శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేయడం ద్వారా పేద, అణగారిన కుటుంబాల పిల్లలకు విద్య, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. కలం ద్వారా పేదల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడం నుంచి, చట్టం ద్వారా వారికి హక్కులు కల్పించేందుకు పోరాడటం వరకు.. విద్య ద్వారా కొత్త తరాలకు భవిష్యత్తు చూపడం నుంచి, భూమి ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించే ప్రయత్నాల వరకు పి. మహేంద్రనాథ్ సాగించిన ప్రస్థానం పాలమూరు సామాజిక చరిత్రలో చెరగని అధ్యాయంగా నిలిచింది. అధికారం, పదవుల కంటే ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన మార్పే నిజమైన నాయకత్వానికి కొలమానమని ఆయన జీవితం చాటిచెబుతోంది. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడుతూనే సామాజిక సమైక్యతను కాపాడిన పి. మహేంద్రనాథ్, పాలమూరు ప్రాంతంలో అణచివేత నుంచి సాధికారత వైపు సాగిన సామాజిక మార్పునకు మార్గదర్శకుడిగా చిరస్థాయిగా నిలిచారు.

# గ్రేటర్ వరంగల్‌లో పారిశుధ్య నిర్వహణ పటిష్టం చేయాలి

**సిబ్బందికి రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి**
**సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కట్టుదిట్టమైన నియంత్రణ**
**కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి ఆదేశాలు**



**హన్మకొండ, 16 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ వరంగల్ నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టంగా, సమర్థవంతంగా చేపట్టాలని, నగర పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల వసూళ్లు, బయోమెట్రిక్ హాజరు, ప్లాస్టిక్ నియంత్రణ, వర్షాకాల సన్నద్ధత తదితర అంశాలపై డివిజన్ల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీడబ్ల్యూఎంసీ పరిధిలో పాయింట్ ఆఫ్ సేల్ (పిఓఎస్) మెషీన్ల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి ఆదాయ వసూళ్లలో పారదర్శకత పెంచాలని, ట్రేడ్ లైసెన్సుల వసూళ్లను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సిబ్బంది విధుల నిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడం తప్పనిసరి చేయాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండకుండా నగరంలోని అన్ని అంతర్గత మురుగు కాలువల్లో డీ-సిల్టింగ్ పనులను 100 శాతం పూర్తి చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో యంత్రాలతో పాటు ప్రత్యేక గ్యాంగ్‌మెన్‌లను వినియోగించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. వాటర్‌లాగింగ్‌కు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. నగరంలో ప్రతిరోజూ కనీసం 400 టన్నుల ఘన వ్యర్థాలను సేకరించేలా శానిటరీ సూపర్వైజర్లు, జవాన్లు నిరంతరం పర్యవేక్షించాలని, పారిశుధ్య వాహనాలు, కంటైనర్లు, ట్రాక్టర్లు ఎల్లప్పుడూ పనిచేసే స్థితిలో ఉండేలా చూడాలని ఆదేశించారు. మరమ్మతులు అవసరమైన వాహనాలను వెంటనే బాగు చేయడంతో పాటు పారిశుధ్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను తప్పనిసరిగా వేర్వేరుగా సేకరించాలని, ప్రస్తుతం తడి చెత్త సేకరణ ఆశించిన స్థాయిలో లేదని పేర్కొంటూ దానిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నాలుగు మోడల్ కాలనీల్లో అమలు చేస్తున్న విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి, తదుపరి సమీక్ష సమావేశం నాటికి తడి చెత్త సేకరణ వ్యవస్థను పూర్తిగా క్రమబద్ధీకరించాలని స్పష్టం చేశారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని అన్ని స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్ మ్యాపింగ్ పూర్తి చేసి, వాటికి కేటాయించిన ప్రాంతాలను ప్రతిరోజూ 100 శాతం కవర్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ప్రతి స్వచ్ఛ ఆటో రోజుకు కనీసం రెండు ట్రిప్పులు చేసి ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు చెత్త తరలించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వ్యర్థ కొబ్బరి బొండాలను వినియోగించి కోకో కాయర్ యూనిట్ల ఉత్పత్తిని పెంచాలని, 15 కే.ఎల్.డి, 150 కే.ఎల్.డి సామర్థ్యం కలిగిన ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టి ప్రతిరోజూ డీ-స్లడ్జింగ్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. ప్రజలను ప్లాస్టిక్ రహిత జీవనశైలి వైపు ప్రోత్సహించేందుకు జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం, ఎక్సైజ్ కాలనీ మార్కెట్ వద్ద ప్రత్యేక ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్లాస్టిక్ వ్యర్థాలను అందజేసే వారికి బట్ట సంచులు, నిత్యావసర వస్తువులు లేదా ప్రోత్సాహక నగదు అందించే విధానాన్ని రూపొందించాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ నగర సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాలు, ఫ్లైఓవర్లు, బండ్ ప్రాంతాల్లో ప్రకృతి పరిరక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతను ప్రతిబింబించే నేచర్-బేస్డ్ వాల్ ఆర్ట్‌తో పాటు ప్రజల్లో స్ఫూర్తి నింపే సందేశాలతో పెయింటింగ్స్ రూపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్, యాంటీ లార్వల్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, ఏ ప్రాంతంలోనైనా వ్యాధుల కేసులు నమోదైతే అక్కడ ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి వెంటనే ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. నివాస ప్రాంతాల్లో పందుల పెంపకాన్ని నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, హసన్‌పర్తిలో రెండో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. లాండ్రోమార్ట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు వాటర్‌లాగింగ్ ప్రాంతాలు, మురుగు కాలువల పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పారిశుధ్యం నగర పరిశుభ్రతతో పాటు ప్రజారోగ్యంతో నేరుగా ముడిపడి ఉన్న అంశమని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఆస్కీ ప్రతినిధి రాజమోహన్, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వరి సాగు తగ్గించండి.. ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లండి

**తక్కువ నీటితో పండే పంటలపై రైతులు దృష్టి సారించాలి**
**పంటల మార్పిడితో సాగు ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచుకోవచ్చు**
**మండల వ్యవసాయాధికారి పంజాల రాజు సూచన**




**హన్మకొండ, 16 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

మారుతున్న వాతావరణ పరిస్థితులు, తగ్గుతున్న భూగర్భ జలమట్టాలు, సాగునీటి లభ్యతలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి పంజాల రాజు సూచించారు. హన్మకొండ మండల పరిధిలోని పలివేల్పుల, వడ్డేపల్లి, కుమార్‌పల్లి, హన్మకొండ ప్రాంతాల్లో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని పంటల మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. వరి సాగుకు అధిక మొత్తంలో నీరు అవసరమవుతుందని, నిరంతరం వరి పంటనే సాగు చేయడం వల్ల భూగర్భ జలాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. సాగునీటి కోసం బోరుబావులపై ఆధారపడే ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను రైతులు ముందుగానే అంచనా వేసి, అందుకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే జొన్న, సజ్జ, పెసలు, మినుములు, కందులు, నువ్వులు, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లోని నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని పంటలను ఎంపిక చేసుకుంటే రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఒకే పంటను వరుసగా సాగు చేయకుండా పంటల మార్పిడి విధానాన్ని పాటించడం వల్ల నేల సారవంతతను కాపాడుకోవడంతో పాటు చీడపీడలు, తెగుళ్ల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ముఖ్యంగా పప్పుధాన్యాల సాగుతో భూసారం మెరుగుపడుతుందని తెలిపారు. తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంచుకోవడం ద్వారా సాగు వ్యయాన్ని నియంత్రించడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తున్నాయని, రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, పంటల ఎంపికపై అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుని స్థానిక పరిస్థితులకు అనువైన పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా వరి సాగుపైనే పూర్తిగా ఆధారపడటం భవిష్యత్తులో ఇబ్బందులకు దారితీయవచ్చని పంజాల రాజు పేర్కొన్నారు. రైతులు ముందుచూపుతో వ్యవహరించి పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని, తక్కువ నీటితో మంచి దిగుబడులు, మెరుగైన ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కాలువలో పడిన గుర్తుతెలియని వృద్ధురాలికి ప్రాణదానం

**అప్రమత్తంగా స్పందించి రక్షించిన బ్లూ కోల్ట్ అధికారి రమేష్**

**నర్సంపేట, 16 జూలై 2026(జై భీమ్ న్యూస్)**



కాలువలో పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న గుర్తుతెలియని వృద్ధురాలిని బ్లూ కోల్ట్ సిబ్బంది అప్రమత్తంగా స్పందించి రక్షించారు. ఈ ఘటన నర్సంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణలో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బ్లూ కోల్ట్ అధికారి రమేష్ కాలువలో ఓ వృద్ధురాలు పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే స్పందించిన ఆయన వృద్ధురాలిని కాలువ నుంచి సురక్షితంగా బయటకు తీసుకొచ్చి, చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వృద్ధురాలు మాట్లాడలేని స్థితిలో ఉండటంతో ఆమె పేరు, స్వస్థలం, కుటుంబ సభ్యుల వివరాలు తెలియరాలేదు. వైద్యుల పర్యవేక్షణలో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. మరోవైపు వృద్ధురాలి వివరాలను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. సకాలంలో స్పందించి వృద్ధురాలిని రక్షించి ఆసుపత్రికి తరలించిన బ్లూ కోల్ట్ అధికారి రమేష్ సేవలను స్థానికులు అభినందించారు. విధి నిర్వహణతో పాటు మానవత్వాన్ని చాటుతూ ఓ నిండు ప్రాణాన్ని కాపాడేందుకు ఆయన చూపిన చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు.

# 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

న్యూఢిల్లీ,జులై 16(జై భీమ్ న్యూస్): పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిజినెస్ లిస్ట్‌ను సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచేందుకు చట్ట సవరణ చేయనుంది. గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో కీలక సవరణలు చేపట్టనుంది. విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లుపై ఈ సమావేశాల్లో చర్చించి.. ఆమోదం తెలపనుంది. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'పై తుది నిర్ణయం తీసుకోనుంది. జనన, మరణాల ఆలస్యం రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయనుంది. జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే చట్టానికి మరికొన్ని సవరణలు చేయనుంది. ఓ÷ూఓఇ రంగంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆలస్యపు చెల్లింపుల పరిష్కారం కోసం సరికొత్త బిల్లులను ఈ సమావేశాల్లో తీసుకురానుంది. ÷ూష్ట్రాలు సొంతంగా ఓ÷ూఓఇ ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణ చేయనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనపు నిధుల వ్యయంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించనుంది. ఆగస్ట్ 13వ తేదీతో ఈ వర్షాకాల సమావేశాలు ముగుస్తాయి.

# ఎల్లాపూర్ చేపల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా మత్స్యశాఖ అధికారి

**ప్రభుత్వ ఆస్తిని రక్షించి పునరుద్ధరించాలని గ్రామస్తుల వినతి**

**జులై 6న ప్రజావాణిలో ఫిర్యాదు.. క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన**



**హసన్‌పర్తి, 16 జులై 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామానికి సంబంధించిన చేపల ఉత్పత్తి కేంద్రాన్ని హనుమకొండ జిల్లా మత్స్యశాఖ అధికారి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చేపల ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించి, కేంద్రాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగతో పాటు గ్రామస్తులు జులై 6న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో మత్స్యశాఖ అధికారి కేంద్రాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారికి చేపల ఉత్పత్తి కేంద్రం గత చరిత్ర, అందుబాటులో ఉన్న వనరులు, భూములకు సంబంధించిన వివరాలను వివరించారు. చేపల పెంపకానికి ఉపయోగపడే పెద్ద బావి, గోదాం, కలగిరి బంగ్లాతో పాటు చేపల పెంపకానికి సంబంధించిన హౌస్‌లు, ఇతర నిర్మాణాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. సర్వే నంబర్ 246లో మొత్తం 12 ఎకరాల 13 గుంటల భూమి ఉండగా, అందులో 2 ఎకరాల 16 గుంటల విస్తీర్ణం చేపల ఉత్పత్తి కేంద్రానికి సంబంధించినదని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ ప్రయోజనాల కోసం దానం చేసిన ఈ భూమిలో ఏర్పాటు చేసిన చేపల ఉత్పత్తి కేంద్రాన్ని రక్షించి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అయితే, ఈ విలువైన ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో గతంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని గ్రామస్తులు ఆరోపించారు. కొందరు వ్యక్తులకు అనుకూలంగా పత్రాలు సృష్టించారనే అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్రంగా రెవెన్యూ రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే చేపల ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన కొన్ని నిర్మాణాలను కూల్చివేశారని కూడా గ్రామస్తులు ఆరోపించారు. ఈ వ్యవహారంలో రాజకీయ, అధికారిక అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ, ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. చేపల ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన భూమి, నిర్మాణాల యాజమాన్యంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఈ భూమిని చేపల ఉత్పత్తి కేంద్రం పునరుద్ధరణకు లేదా ఇతర ప్రజాప్రయోజన కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు. అవసరమైతే ప్రభుత్వ కార్యాలయాలు, డబుల్ బెడ్‌రూమ్ గృహాలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు వంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన విలువైన ప్రభుత్వ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా జిల్లా యంత్రాంగం తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. చేపల ఉత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరిస్తే స్థానికంగా మత్స్య సంపద అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని వారు పేర్కొన్నారు. గ్రామస్తుల నుంచి వివరాలను తెలుసుకున్న జిల్లా మత్స్యశాఖ అధికారి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ, మోతె లింగారెడ్డి, నేదునూరి సునీల్, మోతె మధుసూదన్ రెడ్డి, గంగిళ్ళ వెంకట్ రెడ్డి, ఎండీ షేక్ బాబ్, వెలిసోజు బుచ్చి రాములు, ఎర్ర మరియమ్మ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## కుమారుడి జ్ఞాపకార్థం గ్రామానికి 'స్వర్గ రథం' అందజేత




**వరంగల్ జిల్లా/ఐనవోలు, 16 జులై 2026(జై భీమ్ న్యూస్)**

మండలం గర్మిళ్ళపల్లి గ్రామానికి చెందిన రాజారపు యాదగిరి (యాదన్న), కరెంట్ షాక్‌తో మృతి చెందిన తన కుమారుడు రాజారపు రంజిత్ జ్ఞాపకార్థంగా గ్రామానికి 'స్వర్గ రథం' వాహనాన్ని విరాళంగా అందజేశారు. గ్రామ సర్పంచ్ గబ్బెట రోజా అశోక్, ఉప సర్పంచ్ గిరబోని ఎల్లగౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో వాహనాన్ని గ్రామానికి అందించారు. ఈ సందర్భంగా కొడవటి రవి మాట్లాడుతూ, కుమారుడి జ్ఞాపకార్థంగా గ్రామ ప్రజలకు ఉపయోగపడే స్వర్గ రథాన్ని అందించడం అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధికి యాదగిరి సహాయ సహకారాలు కొనసాగాలని ఆకాంక్షించారు. స్వర్గ రథాన్ని అందించిన యాదగిరికి గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బీరం మౌనిక దేవేందర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ కలకోట అనిల్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్**






**హన్మకొండ, 16 జులై 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో తాగునీటి సరఫరా, సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్య, వాతావరణ పరిస్థితులు, పౌర సరఫరాలు, ప్రజా పాలన తదితర కీలక అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యంగా ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టడం, సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, విద్యా రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్నతో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ప్రజారోగ్యం, విద్య, పౌర సరఫరాలు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ప్రజా పాలన కార్యక్రమాల అమలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, జడ్పీ సీఈవో శేషాద్రి, సీపీవో సత్యనారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చంద్ర, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, డీఈవో గిరిరాజ్ గౌడ్, డీఐఈవో గోపాల్, డీపీవో లక్ష్మీ రమాకాంత్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, డీవైఎస్‌వో ప్రశాంత్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ నాయక్, మిషన్ భగీరథ ఈఈ రామాంజనేయులు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, అదనపు డీఆర్డీవో లక్ష్మీ ప్రసన్నతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య చేసుకున్న ఫోక్సో కేసు నిందితుడు

కామారెడ్డి,జూలై16(జై భీమ్ న్యూస్): కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం చింతామన్‌పల్లి గ్రామంలో యువకుడి ఆత్మహత్య కలకలం రేపింది. రంగబోయిన సందీప్ (23) అనే యువకుడు గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న సందీప్.. ఇటీవలే జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి బాలిక తల్లిదండ్రులు తనను తరచూ వేధిస్తూ.. బెదిరింపులకు గురిచేస్తున్నారనే ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపానికి గురై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. గ్రామ శివారులో సందీప్ మృతదేహం వేలాడుతుండటం గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించారు. బాధిత బాలిక కుటుంబ సభ్యుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని సందీప్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణం వల్లే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా దోమకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## రూ.60 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఇరిగేషన్ అధికారులు

**కోళ్ల ఫారం నిర్మాణానికి ఎన్‌వోసీ జారీ కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణ**



**ఆదిలాబాద్, 16 జులై 2026(జై భీమ్ న్యూస్)**

కోళ్ల ఫారం నిర్మాణానికి అవసరమైన నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌వోసీ) జారీ చేసేందుకు రూ.60 వేల లంచం తీసుకుంటున్న ఇద్దరు ఇరిగేషన్ శాఖ అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కారు. ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాథోడ్ విఠల్, అసిస్టెంట్ ఇంజనీర్ రూపావతి రమేష్లను రూ.60 వేల లంచం నగదు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. సోనాల్ గ్రామంలో కోళ్ల ఫారం నిర్మించేందుకు అవసరమైన ఎన్‌వోసీ జారీ చేసే విషయంలో సంబంధిత వ్యక్తి నుంచి అధికారులు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ పేర్కొంది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, పక్కా ప్రణాళికతో అధికారులు వలపన్ని లంచం నగదు తీసుకుంటున్న సమయంలో ఇద్దరినీ పట్టుకున్నట్లు తెలిసింది. నిందితుల వద్ద నుంచి రూ.60 వేల లంచం నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి తదుపరి దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు నిర్భయంగా ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

## శ్రీరాములపల్లెలో 17న ఉచిత మెగా వైద్య శిబిరం

**ఏకశిలా హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య సేవలు**




**కమలాపూర్, 16 జులై 2026(జై భీమ్ న్యూస్)**

శ్రీరాములపల్లె గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఏకశిలా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. శ్రీరాములపల్లె, అంబాల గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఈ వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్, న్యూరో సర్జన్, ఆర్థోపెడిక్, యూరాలజీ, కార్డియాలజీ, గైనకాలజీ విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు అందించనున్నట్లు పేర్కొన్నారు. జ్వరం, జలుబు వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు నరాలు, మెదడు, వెన్నెముక, ఎముకలు, కీళ్లు, కిడ్నీ, మూత్ర సంబంధిత సమస్యలు, గుండె వ్యాధులు, గర్భిణుల ఆరోగ్యం, మహిళలకు సంబంధించిన వివిధ ఆరోగ్య సమస్యలకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు. శిబిరంలో బీపీ, షుగర్, 2డి ఎకో, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం వెల్లడించింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్పెషలిస్ట్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. శ్రీరాములపల్లె, అంబాల గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏకశిలా హాస్పిటల్ యాజమాన్యం కోరింది. మరిన్ని వివరాలకు 9676482525 నంబర్‌ను సంప్రదించాలని సూచించింది.

# స్నేహితుని కుటుంబానికి అండగా 1999-2000 పదో తరగతి పూర్వ విద్యార్థులు

**జై భీమ్ న్యూస్  పర్వతగిరి జులై 16**

రోడ్డు ప్రమాదంలో మరణించిన స్నేహితుని కుటుంబానికి మేమున్నామంటూ 1999-2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. పర్వతగిరి మండల కేంద్రంలోని విశ్వ జెనిత్ స్కూల్ కరెస్పాండెంట్ ఎర్రబెల్లి హరి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన సంగతి తెలిసిందే.ఈ రోజు హరి దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన పాఠశాల స్నేహితులు (1999-2000 టెన్త్ క్లాస్ బ్యాచ్) పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. హరితో తమకున్న పాత జ్ఞాపకాలను, స్నేహాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకుని కన్నీటిపర్యంతమయ్యారు.అనంతరం, ఆర్థికంగా ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచేందుకు స్నేహితులంతా కలిసి ఒక నిర్ణయం తీసుకున్నారు. హరి కుమార్తె ఆధ్యశ్రీ భవిష్యత్తు కోసం రూ. 1,00,000 (అక్షరాలా లక్ష రూపాయలు) సేకరించి, పోస్టల్ అకౌంట్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ డిపాజిట్ పత్రాలను హరి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకున్న పూర్వ విద్యార్థుల ఉదారతను స్థానికులు మరియు గ్రామస్తులు అభినందించారు.



# నారాయణ పాఠశాలలో ఘనంగా విద్యార్థి నాయకుల పట్టాభిషేక వేడుక





**మైనర్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరం: కాజీపేట ఎస్‌హెచ్‌ఓ జె. శ్యాంసుందర్**

**కాజీపేట, 16 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట నారాయణ పాఠశాలలో విద్యార్థి నాయకుల పట్టాభిషేక వేడుక ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులకు బాధ్యతలు అప్పగిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జోనల్ డీజీఎం రిజ్వానా ఇమ్రాన్, కాజీపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జె. శ్యాంసుందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎస్‌హెచ్‌ఓ జె. శ్యాంసుందర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, బాధ్యత, అంకితభావం, సామాజిక స్పృహను అలవర్చుకోవాలని సూచించారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ముఖ్యంగా మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు, సెల్ఫీలు, రీల్స్‌ను విచక్షణారహితంగా పోస్టు చేయడం వల్ల సైబర్ నేరగాళ్ల బారినపడే ప్రమాదం ఉందన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం, ఖాతాలను హ్యాక్ చేయడం, మార్ఫింగ్ లేదా డీప్‌ఫేక్ కంటెంట్ సృష్టించి బెదిరింపులకు పాల్పడటం వంటి సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనుమానాస్పద లింకులు, అపరిచితుల సందేశాలు, ఆన్‌లైన్ పరిచయాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. విద్యార్థులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరమని, ఆన్‌లైన్ గేమింగ్‌కు అతిగా అలవాటుపడటం వల్ల చదువుతో పాటు మానసిక, సామాజిక జీవితంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. సాంకేతికతను అవసరానికి అనుగుణంగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ తమ మత గ్రంథాలను చదివినట్లుగానే దేశ పౌరులుగా భారత రాజ్యాంగం, చట్టాలపై కనీస అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకోవడం ద్వారా ఉత్తమ పౌరులుగా ఎదగవచ్చని పేర్కొన్నారు. పాఠశాల ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులు గెలుపును హుందాగా స్వీకరించాలని, తమకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. విద్యార్థి దశలోనే ఇటువంటి నాయకత్వ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో మంచి నాయకత్వ లక్షణాలు, నిర్ణయ సామర్థ్యం, జట్టుగా పనిచేసే నైపుణ్యం పెంపొందుతాయని తెలిపారు. అనంతరం ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థి నాయకులకు అతిథులు బ్యాడ్జీలు అలంకరించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రిసోర్స్ రిక్రూటర్ చంద్ర మౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ అనిత, జోనల్ కోఆర్డినేటర్లు ఆకుల సాయికృష్ణ, శ్యామల, శిరీష, ఆర్ఎస్‌టీ బానోత్ లకుపతి, అకడమిక్ డీన్ గణేష్, వీపీలు అనూష, మౌనిక, హాఫీజ్, ఏఓ గుంపుల చేరాలు, వీణకుమారి, హ్యారీరాజన్, బందెల వీరన్న, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# కపాలినీ - భగమాలినీ మాతగా భద్రకాళీ అమ్మవారు

**వరంగల్, 16 జూలై 2026(జై భీమ్ న్యూస్)**



కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్‌లోని శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం దీక్షా హోమం జరిపారు. తదుపరి చతుస్థానార్చనను పూర్తి చేసి, తిథిమండల దేవతాయజనంలో భాగంగా అమ్మవారి షడ్చేరాలలో జ్ఞానశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి కపాలినీ మాతగా, క్రియాశక్తిని షోడశీ క్రమాన్ని అనుసరించి భగమాలినీ మాతగా ప్రత్యేకంగా అలంకరించి పూజారాధనలు నిర్వహించారు. కపాలినీ మాత సృష్టిని అసురీ శక్తుల విధ్వంసం నుంచి కాపాడే దివ్యశక్తిగా భక్తులు విశ్వసిస్తారని ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. పైశాచిక శక్తులను సంహరించి, అసురీ శక్తులపై దైవీ శక్తుల విజయానికి సంకేతంగా రాక్షసుల కపాలాలను మాలగా ధరించిన రూపమే కపాలినీ మాత అని వివరించారు. అదేవిధంగా భగమాలినీ మాతను బ్రాహ్మీ శక్తి అని కూడా పిలుస్తారని తెలిపారు. భగమాలినీ మాతను భక్తిశ్రద్ధలతో ఉపాసించడం వల్ల సత్సంతానం, సౌభాగ్యం సిద్ధిస్తాయని ఆధ్యాత్మిక విశ్వాసం ఉందన్నారు. శాకంభరీ నవరాత్ర మహోత్సవాల్లో రెండో రోజు విదియ తిథికి అధిదేవత అయిన బ్రహ్మదేవుడికి ప్రత్యేక ఉపాసన నిర్వహించడంతో పాటు బ్రహ్మ యజనం కూడా శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు వెల్లడించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత ఆధ్వర్యంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

# దశదిన కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి





**జై భీమ్ న్యూస్ పర్వతగిరి జూలై 16**


పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన విశ్వజెనిత్ కరస్పాండెంట్ ఎర్రబెల్లి హరికుమార్ దశదిన కార్యక్రమానికి నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హరికుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్, పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ సందెల నవీన్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రంగు కుమార్, మాజీ సర్పంచ్ బండి సంతోష్, ఎల్లగౌడ్, పార్టీ కార్యకర్తలు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# భద్రతను తగ్గించుకున్న వరంగల్ సీపీ శ్వేత

**నలుగురు గన్‌మెన్లలో ఇద్దరిని తగ్గించుకున్న సీపీ**
**అవసరమైన వారికే భద్రత కల్పించాలని డీజీపీకి మహ్మద్ ఫసియుజ్జామా లేఖ**

**వరంగల్, 16 జూలై 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

రాష్ట్రంలో మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గిన నేపథ్యంలో పోలీస్ అధికారులకు కేటాయిస్తున్న గన్‌మెన్లు, వ్యక్తిగత భద్రతా సిబ్బంది (పీఎస్ఓ) విధానాన్ని పునఃసమీక్షించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులకు విరివిగా అమలు చేస్తున్న 'వన్ ప్లస్ వన్' (1o1) గన్‌మెన్ల కేటాయింపును సమీక్షించాలని కోరుతూ వరంగల్‌కు చెందిన మహ్మద్ ఫసియుజ్జామా రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమైన క్షేత్రస్థాయి పోలీసింగ్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాస్తవంగా భద్రతాపరమైన ముప్పు ఉన్న అధికారులకు మాత్రమే గన్‌మెన్లు, పీఎస్ఓలను కేటాయించాలని కోరారు. ఎలాంటి ప్రత్యేక ముప్పు లేని అధికారుల వద్ద విధులు నిర్వహిస్తున్న అదనపు భద్రతా సిబ్బందిని వెనక్కి తీసుకుని పోలీస్ స్టేషన్లు, క్షేత్రస్థాయి విధులకు కేటాయిస్తే సిబ్బంది కొరతను కొంతవరకు అధిగమించవచ్చని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత తన వ్యక్తిగత భద్రతను స్వచ్ఛందంగా తగ్గించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నక్సల్స్ నుంచి తనకు ఎలాంటి ప్రత్యేక ముప్పు లేదని పేర్కొంటూ, గతంలో తన భద్రత కోసం విధులు నిర్వహిస్తున్న నలుగురు గన్‌మెన్ల సంఖ్యను ఇద్దరికి తగ్గించుకున్నట్లు సమాచారం. అవసరానికి మించి వ్యక్తిగత భద్రత కోసం పోలీస్ సిబ్బందిని వినియోగించకుండా, వారి సేవలను క్షేత్రస్థాయిలో ప్రజల భద్రత కోసం ఉపయోగించాలనే ఉద్దేశంతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత, పెరుగుతున్న విధుల భారం నేపథ్యంలో ఉన్నతాధికారిగా తన భద్రతా సిబ్బందిని స్వచ్ఛందంగా తగ్గించుకోవడం ద్వారా సీపీ శ్వేత ఆదర్శంగా నిలిచారని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భద్రతా సిబ్బంది కేటాయింపులను ఎప్పటికప్పుడు ముప్పు అంచనా ఆధారంగా సమీక్షించి, అవసరం లేని చోట ఉన్న సిబ్బందిని తిరిగి క్షేత్రస్థాయి విధులకు కేటాయించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీపీ శ్వేత తీసుకున్న నిర్ణయం పోలీస్ శాఖలోనే కాకుండా ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత భద్రత కంటే ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పోలీస్ సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించాలనే ఆమె నిర్ణయంపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.



Date: 16 July / 2026
Warangal

To
The Director General of Police,
Telangana State,
Hyderabad.

Subject: Representation seeking clarification regarding the purpose and policy governing the deployment of 1+1 Personal Security Officers (PSOs)/Gunmen to Inspector-rank police officers.

Respected Sir,

I, Mohammed Fasiuzzama, residing at H. No. 19-10-345/1, Shambhunipet, Warangal, Telangana, respectfully submit this representation in the interest of transparency, accountability, and efficient utilization of police resources.

1. I respectfully submit that, for several years, certain Inspector-rank police officers have been provided with 1+1 Personal Security Officers (Constable-rank personnel) for their personal security.

2. I further submit that the Telangana Police Intelligence and Law & Order Department has publicly stated that the State has witnessed a significant decline in Left Wing Extremist (Maoist) activities following successful anti-extremist operations, large-scale surrenders of cadres, and the dismantling of the CPI (Maoist) State Committee.


3. At the outset, I sincerely appreciate the initiative taken by the Telangana Police under CV Anand IPS and Telangana Chief minister leadership in rationalizing the deployment of police security personnel and bulletproof vehicles previously provided to former DGPs, VIPs, and

# ఎడ్యుకేషన్ జిహాద్‌పై బిజెపి ఆగ్రహం

**సైదాబాద్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి**
**బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు డిమాండ్**

**హైదరాబాద్,జూలై16(జై భీమ్ న్యూస్):'**

ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి స్పష్టం చేశారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షికమైన, సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో పాటు కారకులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని రాంచందర్ రావు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందంటూ ఆయన మండిపడ్డారు. ఇందుకు పాతబస్తీ సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్–ఫాతిహాలను చదివి రావాలని హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్' అని, రేవంత్ చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు. తమ బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, పాఠశాల యాజమాన్యాన్ని ధైర్యంగా నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని రాంచందర్ రావు పేర్కొన్నారు. హిందూ విద్యార్థులు, వారి కుటుంబాల భద్రత, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కళ్లు మూసుకుని వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు, కల్మాలు బలవంతంగా రుద్దడం ఏమాత్రం సహించబోమన్నారు. కొన్ని కాన్వెంట్ స్కూళ్లలో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రాకూడదని ఒత్తిడి చేస్తూ మతాచారాలకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యా సంస్థలు విద్యను అందించాలే తప్ప, విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కులను గౌరవించాల్సిన బాధ్యత అన్ని పాఠశాలలపై ఉందన్నారు.



# జగన్నాథుడి ఆశిస్సులతో దేశం సుభిక్షంగా ఉండాలి

**రథయాత్ర సందర్భంగా డిప్యూటి సిఎం స్పందన**

**అమరావతి,జులై 16(జై భీమ్ న్యూస్):**

పూరీ జగన్నాథుని ఆశీస్సులతో దేశం సుభిక్షంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పవిత్రమైన జగన్నాథ రథయాత్ర సందర్భంగా.. జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవిలకు భక్తిపూర్వకంగా నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు. రథయాత్ర అనేది విశ్వాసం, భక్తి, దేవునికి, భక్తులకు మధ్య ఉన్న శాశ్వత అనుబంధానికి సంబంధించిన ఓ దివ్యమైన వేడుక అని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పోస్టు పెట్టారు. పవిత్ర రథాలు ముందుకు సాగుతుండగా, జగన్నాథస్వామి ఆశీస్సులు ప్రతి హృదయానికి శాంతిని, ప్రతి కుటుంబానికి బలాన్ని, ప్రతి జీవితానికి ఆశను ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.స్వామి మనల్ని ధర్మమార్గంలో నడిపించి, మన ఇళ్లను సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో నింపాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. అలాగే వినమ్రత, భక్తితో సమాజానికి సేవ చేసే జ్ఞానాన్ని, ధైర్యాన్ని మనకు ప్రసాదించాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

# భీమారంలో ఇరుకైన రోడ్డుతో ప్రజల అవస్థలు

**ఎన్‌హెచ్-563పై యూటర్న్ మూసివేతతో మరింత పెరిగిన ట్రాఫిక్ సమస్య**



**భీమారం, జూలై 16, 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా 55వ డివిజన్ పరిధిలోని భీమారంలో ఇరుకైన రహదారి కారణంగా వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భీమారం నుంచి చింతగట్టు వైపు వెళ్లే ప్రధాన మార్గంలో మెయిన్ రోడ్డు నుంచి చర్చి వరకు రహదారి కేవలం 10 అడుగుల వెడల్పు మాత్రమే ఉండటంతో నిత్యం వందలాది వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భీమారం పరిసర ప్రాంతాల్లో పలు విద్యాసంస్థలు ఉండటంతో ప్రతిరోజూ స్కూల్, కాలేజీ బస్సులతో పాటు ట్రాక్టర్లు, టిప్పర్లు, ఇతర ప్రైవేటు వాహనాలు పెద్ద సంఖ్యలో ఈ మార్గంలో ప్రయాణిస్తున్నాయి. ఇరుకైన రోడ్డు కారణంగా ఎదురెదురుగా రెండు పెద్ద వాహనాలు వచ్చినప్పుడు దారి లేక ట్రాఫిక్ నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యాసంస్థల బస్సుల రాకపోకలతో పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోందని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ చొరవతో భీమారం బస్‌స్టాప్ నుంచి చింతగట్టు వరకు రూ.4 కోట్లతో రోడ్డు మంజూరైనట్లు స్థానికులు తెలిపారు. అయితే చర్చి నుంచి చింతగట్టు వరకు మాత్రమే రోడ్డు పనులు చేపట్టి, అత్యంత రద్దీగా ఉండే భీమారం మెయిన్ రోడ్డు నుంచి చర్చి వరకు ఉన్న భాగాన్ని విస్తరించకుండా అర్ధాంతరంగా వదిలేశారని ఆరోపిస్తున్నారు. కోట్ల రూపాయల నిధులు మంజూరైనప్పటికీ ప్రధాన సమస్యకు పరిష్కారం లభించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రహదారిని కనీసం 40 అడుగుల మేర విస్తరించి, మిగిలిపోయిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర వాహనాలు సైతం సకాలంలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భీమారం మెయిన్ రోడ్డు వద్ద ఎన్‌హెచ్-563పై ఉన్న యూటర్న్‌ను మూసివేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమైందని గ్రామస్తులు చెబుతున్నారు. జయగిరి, చింతగట్టు, మునిపల్లి తదితర గ్రామాల నుంచి వచ్చే ప్రజలు భీమారం మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో గ్రామంలోని ఇరుకైన రహదారిపై వాహనాల ఒత్తిడి పెరుగుతోందని పేర్కొంటున్నారు. యూటర్న్ లేకపోవడంతో వాహనదారులు అదనపు దూరం ప్రయాణించి తిరిగి రావాల్సి వస్తోందని వాపోతున్నారు. భీమారం ప్రధాన రహదారి వద్ద నెలకొన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. జాతీయ రహదారి భద్రతా నిబంధనలకు అనుగుణంగా సురక్షితమైన జంక్షన్ లేదా యూటర్న్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించడంతో పాటు రద్దీ సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏళ్లుగా ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుడు, భీమారం గ్రామవాసి ఆకుల కుమార్ మాట్లాడుతూ.. భీమారం రోడ్డు, యూటర్న్ సమస్యలను ఇప్పటికే పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయడంతో పాటు ఎన్‌హెచ్-563 వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

# మమతా బెనర్జీకి వరు షాక్‌లు

**టిఎంసికి, రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ రాజీనామా**

**ఛైర్మన్ రాధకృష్ణకు రాజీనామా అందచేత**

**కోల్‌కతా,జూలై16(జై భీమ్ న్యూస్):**

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులూతనే ఉన్నాయి. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ రుక్మిణి మల్లిక్ (కోయెల్ మల్లిక్) షాక్ ఇచ్చారు. టీఎంసీకి, రాజ్యసభ సభ్యత్వానికి రుక్మిణి మల్లిక్ గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆమె సమర్పించారు. దీంతో రాజ్యసభ నుంచి వైదొలిగిన నాలుగో టీఎంసీ ఎంపీగా రుక్మిణి నిలిచారు. ఇప్పటికే ఆ పార్టీ నుంచి సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరైక్, సుష్మితా దేబ్ తమతమ రాజ్యసభ ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఏడాది ఆరంభంలోనే రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ ఎన్నికయ్యారు. టీఎంసీ 2026 ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలకు ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికై ఏప్రిల్ 6న రాజ్యసభ ఎంపీగా రుక్మిణి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన వెంటనే టీఎంసీ, మమతా బెనర్జీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ఓ కొత్త ప్రయాణానికి ఆరంభమని, ఉత్తమంగా పని చేసేందుకు ప్రయత్నిస్తానని రుక్మిణి చెప్పుకొచ్చారు. అయితే ఎంపీగా ఎన్నికై నాలుగు నెలలు గడవక ముందే తన పదవికి ఆమె రాజీనామా చేయడం సంచలనంగా మారింది. కాగా, రుక్మిణి మల్లిక్ రాజీనామాపై టీఎంసీ, మమతా బెనర్జీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. రుక్మిణి మల్లిక్.. కోయెల్ మల్లిక్ పేరుతో బెంగాలీ చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నటి. టాలీ-క్వీన్‌గా ప్రసిద్ధి చెందిన రుక్మిణి రెండు దశాబ్దాలకు పైగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. 'నాటర్ గురు', 'శుభోదృష్టి', 'మోన్ మానే నా', 'ప్రేమేర్ కహానీ', '100? లవ్', 'రంగబాజ్' వంటి వరుస హిట్ చిత్రాల్లో ఆమె నటించి మెప్పించారు. రుక్మిణి నటనకు గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ బంగ్లా, రెండు బీఎఫ్‌జేఏ అవార్డులు, ఆనందలోక్ పురస్కార్ వంటి అనేక గౌరవాలను అందుకున్నారు. 2023లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆమెకు మహానాయక్ సమ్మాన్‌ను కూడా ప్రదానం చేసింది. అనంతరం టీఎంసీ పార్టీ ఆమెను రాజ్యసభకు నామినేట్ చేసింది.

# కార్మికుల కష్టాలకు గుర్తింపు ఎక్కడ

**తెలంగాణ గ్రామ పంచాయతి సిబ్బందిలపై జై భీమ్ న్యూస్ స్పెషల్ ఫోకస్**

**ఊరు నిద్రలేవక ముందే లేచే చేతులు... ఇప్పుడు కన్నీళ్లు పెడుతున్నాయి**

**80 వేల గ్రామపంచాయతీ సిబ్బంది గుండె చీల్చే కథ**

**కాంగ్రెస్ ప్రభుత్వమా... మా బతుకులకు కూడా ఒక వెలుగు ఇవ్వండి**




**హైదరాబాద్ జై భీమ్ న్యూస్:-**

మీరు ఉదయం 6 గంటలకు నిద్రలేచి చూసేసరికి వీధులు శుభ్రంగా ఉంటాయి. చెత్త డబ్బా ఖాళీగా ఉంటుంది. డ్రైనేజీ పొంగకుండా ఉంటుంది. "పల్లె ప్రగతి" అవార్డు వచ్చిందని పేపర్లో ఫోటోలు వస్తాయి. కానీ ఆ శుభ్రం వెనుక ఎంతమంది కన్నీళ్లు ఉన్నాయో ఎవరికీ తెలియదు. వారే తెలంగాణలోని 80 వేల మంది గ్రామపంచాయతీ సిబ్బంది. 12,769 గ్రామాలకు వీరే ప్రాణం. వానలో తడిసి, ఎండలో కాలుతూ, పండగ రోజు కూడా ఇంట్లో ఉండకుండా ఊరి కోసం పనిచేసేవారు. "ప్రజా పాలన - ప్రజల ప్రభుత్వం" అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది అయింది. ఆరు గ్యారెంటీలు వచ్చాయి. రైతుకు భరోసా వచ్చింది. పేదలకు చేయూత వచ్చింది. కానీ ఊరిని శుభ్రం చేస్తున్న ఈ చేతులకు మాత్రం ఇంకా న్యాయం రాలేదు. మురుగులోకి దిగుతున్నారు. చెత్తలో గాజు ముక్కలు, కెమికల్స్, రక్తం ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు. నెలకు చేతికి వచ్చేది 9500వేలు. అది కూడా 3 నెలలకు, 4 నెలలకు ఒకసారి. కొన్ని గ్రామాలలో పంచాయతీ సెక్రెటరీ డబ్బులు వాడుకుంటూ కనీస వేతనాలు కూడా ఇవ్వకపోగా ఆరోగ్యం బాగా లేక పనికి పోకపోతే వేతనాలు కట్ చేస్తే ఎలా బ్రతకాలని విలపిస్తున్నారు

**గుండె లోతుల్లో నుంచి వచ్చే మాటలు...**

ఒక సిబ్బంది గొంతు వణుకుతూ అడిగాడు సార్ అద్దె 4000, బియ్యం 1800, పిల్లల ఫీజు 3000. మిగిలేది ఏముంది? జీతం రాకపోతే వడ్డీకి అప్పు చేయాల్సి వస్తుంది. రాత్రి పిల్లలు 'నాన్న బిస్కెట్ తీసుకురా' అంటే జేబులో డబ్బులు లేక తల దించుకున్నాను మేము మనుషులం కాదా? మరొక తల్లి కళ్లలో నీళ్లతో చెప్పింది. ఉదయం 5 గంటలకు వెళ్తాను. రాత్రి 9 కి వస్తాను. చిన్న పిల్లాడు 'అమ్మ కథ చెప్పు' అంటాడు. నా గొంతు బొంగురుపోయి ఉంటుంది. మురుగు వాసన కొడుతూ ఉంటుంది. వాడిని దగ్గరికి తీసుకోలేను. ఇదేనా మా బతుకు? ఒక పంచాయతీకి కనీసం 8 మంది ఉండాలి. కానీ ఉన్నారు 2-3 మంది. ఉదయం ఊడ్చడం, మధ్యాహ్నం బిల్లులు, సాయంత్రం ఎస్ ఆర్ ఐ డేటా ఎంట్రీ, రాత్రి ఇందిరమ్మ ఇళ్ల సర్వే. ఇంటికి వెళ్లేసరికి పిల్లలు నిద్రపోతుంటారు. భార్య "అన్నం పెట్టనా" అని అడిగేసరికి కళ్లలో నీళ్లు తిరుగుతాయి. బి"ఊరంతా నిద్రపోతుంటే మేము మాత్రం ఊరి కోసం కాపలా కాస్తున్నాం సార్ 15-20 సంవత్సరాలుగా పనిచేస్తున్నా ఇంకా "కాంట్రాక్ట్" అనే ముద్ర. పీఫ్ లేదు, ఇ ఎస్ ఐ లేదు, పెన్షన్ లేదు. 60 ఏళ్లు వచ్చాక ఇంటికి వెళ్లు అంటారు. కోవిడ్ టైంలో ప్రాణాలకు తెగించి ఇంటింటికి తిరిగాం. అప్పుడు హీరోలు అన్నారు. కరోనా వచ్చి చనిపోయిన మా స్నేహితుడి కుటుంబానికి ఒక్క రూపాయి సాయం కూడా రాలేదు సార్. ఇప్పుడు మమ్మల్ని మర్చిపోయారు"బి అని మరొకరు కన్నీరు పెట్టుకున్నారు. డ్రైనేజీలో దిగినప్పుడు విషపు గ్యాస్ కు ఊపిరాడదు. చెత్తలో గాజు గుచ్చుకుంటే రక్తం కారుతుంది. ఆసుపత్రికి వెళ్తే "నీది ప్రభుత్వ ఉద్యోగం కాదు" అంటారు. బి" మేము చస్తే మా పిల్లలను ఎవరు చూస్తారు? ఒక్క ప్రమాద బీమా కూడా లేదు కాంగ్రెస్ అంటే పేదల పార్టీ అంటారు. కార్మికుల పార్టీ అంటారు. మరి మేము కార్మికులం కాదా? మేము పేదలం కాదా? మా ఓట్లు కూడా లెక్కలోకి వస్తాయి కదా ?అని వాళ్లు ప్రశ్నిస్తున్నారు.

**ఇది ఒక్కరి కథ కాదు ఇది 4 లక్షల మంది కథ**

రాష్ట్రవ్యాప్తంగా 80 వేల కుటుంబాలు. ప్రతి ఇంట్లో 4-5 మంది. లెక్కేస్తే దాదాపు 4 లక్షల మంది. వాళ్ల కళ్లన్నీ ఈరోజు ప్రభుత్వం వైపు చూస్తున్నాయి. మా పిల్లలు కూడా చదువుకోవాలి . మాకు కూడా ఒక ఇల్లు ఉండాలి. మా ముసలితనానికి ఒక భరోసా ఉండాలి. అంతకు మించి ఏమీ అడగడం లేదు. ఊరు శుభ్రంగా ఉంటేనే మీరు ఆరోగ్యంగా ఉంటారు. ఆ పని చేస్తున్న మా చేతులను ఆదుకోండి. నెలకు 25,000 గౌరవ వేతనం ఇవ్వండి. ప్రతి నెల 1వ తేదీన జీతం జమ చేయండి. 5 ఏళ్లు దాటిన 80 వేల మందికి శాశ్వత ఉద్యోగం ఇవ్వండి. ప్రతి ఒక్కరికి యూనిఫాం, గ్లౌజులు, బూట్లు, 10 లక్షల బీమా ఇవ్వండి. పీఫ్ , ఇ ఎస్ ఐ పెన్షన్ ఇచ్చి మా ముసలితనానికి భరోసా ఇవ్వండి. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే మా గురించి ఒక మాట మాట్లాడండి సార్. మా పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది. ఒక కార్మికుడి కన్నీరు... ఒక ప్రభుత్వ పరీక్ష. ఒక కార్మికుడి నవ్వు... అదే నిజమైన ప్రజా పాలన. - రఘు గొర్రెకుంట భీమ్ న్యూస్ రిపోర్టర్ పర్వతగిరి.

# సమాజ అభివృద్ధికి అంబేద్కర్ భావజాల వ్యాప్తే మార్గం: పద్మశ్రీ మందకృష్ణ మాదిగ



**హన్మకొండ, 16 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

సమాజ అభివృద్ధి, అణగారిన వర్గాల సంక్షేమం, సామాజిక సమానత్వం సాధించాలంటే భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ అంబేద్కర్ సెంటర్ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ పుల్ల శ్రీనివాస్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మందకృష్ణ మాదిగ ఆయనకు శు భాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ శ్రేణులు, దళిత, బహుజన సంఘాల నాయకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ గ్రంథాలయం నుంచి అంబేద్కర్ స్టడీ సెంటర్ వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ పుల్లా శ్రీనివాస్, కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నుంచి జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ డాక్టర్ పుల్ల శ్రీనివాస్ నాయకత్వంలో అంబేద్కర్ సెంటర్ మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అంబేద్కర్ భావజాలం, సిద్ధాంతాలు, రాజ్యాంగ విలువలను సమాజంలోని అన్ని వర్గాలకు చేరవేసేందుకు అంబేద్కర్ సెంటర్ వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా దళిత, బహుజన, అణగారిన వర్గాలకు విజ్ఞానాన్ని పంచుతూ వారి అభ్యున్నతికి అండగా నిలవాలని సూచించారు. జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పుల్ల శ్రీనివాస్‌ను పలువురు అధ్యాపకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ బైరు వెంకటరామిరెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేష్‌లాల్, డాక్టర్ చిర్రా రాజు గౌడ్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్. రమణ, ప్రొఫెసర్ కె. భిక్షాలు, ప్రొఫెసర్ ఎం. స్వర్ణలత, ప్రొఫెసర్ ఎల్.పి. రాజ్‌కుమార్, డాక్టర్ బి.ఎస్.ఎల్. సౌజన్య, డాక్టర్ తాడూరి శాస్త్రి, ప్రొఫెసర్ పి. శ్రీనివాసరావు, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ సంకినేని వెంకట్, డాక్టర్ పోడేటి శ్రీనివాస్, డాక్టర్ ఎన్. సుజాత, వివిధ సంఘాల ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కంటి వెలుగుకు అండగా నిలుస్తా

**ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నూతన ఆప్తాల్మిక్ ఆఫీసర్‌గా డా. ప్రతాప్ బాధ్యతల స్వీకరణ**

**గ్రామీణ ప్రాంతాల్లో నేత్ర సమస్యల గుర్తింపు, సకాలంలో చికిత్సపై ప్రత్యేక దృష్టి**

**హన్మకొండ జిల్లా/హసన్‌పర్తి, 16 జూలై 2025 (జై భీమ్ న్యూస్)**




ప్రజలకు మెరుగైన నేత్ర వైద్య సేవలను అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని నూతన ఆప్తాల్మిక్ ఆఫీసర్ డా. ప్రతాప్ తెలిపారు. హసన్‌పర్తి ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆప్తాల్మిక్ ఆఫీసర్‌గా ఆయన నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డా. ప్రతాప్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి సకాలంలో అవసరమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు నేత్ర ఆరోగ్యంపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో నేత్ర పరీక్షలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి, నేత్ర సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఉన్నత స్థాయి ఆసుపత్రులకు సిఫారసు చేయడంతో పాటు వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తానని వెల్లడించారు. కంటి సమస్యలను చిన్నవిగా భావించి నిర్లక్ష్యం చేయడం వల్ల భవిష్యత్తులో చూపుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని డా. ప్రతాప్ హెచ్చరించారు. కంటి చూపు మందగించడం, కళ్లలో మంట, ఎర్రబడటం, నీరు కారడం, తలనొప్పి వంటి సమస్యలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందుబాటులో ఉన్న నేత్ర వైద్య సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే తన లక్ష్యమని డా. ప్రతాప్ పేర్కొన్నారు. ప్రజల కంటి వెలుగును కాపాడేందుకు తనవంతు బాధ్యతగా నిరంతరం సేవలు అందిస్తానని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డా. ప్రతాప్‌కు ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డా. రామ్ భార్గవ్, డా. కృతిక, డా. భరత్, డా. జ్యోతి, ఆరోగ్య సిబ్బంది జ్యోతి, బేబీ తదితరులు అభినందనలు తెలిపి శు భాకాంక్షలు తెలియజేశారు.

# గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు





**అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ పూజలు**
**వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ**

**హైదరాబాద్,జూలై16(జై భీమ్ న్యూస్):**

గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్ఛారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాడ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సమర్పణతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న దేవాలయాలకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఆషాడ బోనాల ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సంతోషంగా అమ్మవార్లను దర్శించుకుని వెళ్ళేలా సకల ఏర్పాట్లను చేసినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# తెలంగాణ కమిటీకి చట్టబద్ధత కల్పించాలి..

**సమీక్షల కోసం క మిటీ సభ్యులే జిల్లాలకు రావాలి**
**మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారుల డిమాండ్**

**హైదరాబాద్,జూలై16(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ గురువారం అమరవీరుల స్మారక చిహ్నంలో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోతె శోభన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్ తదితరులు హాజరై ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనలో మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. సింగరేణి బొగ్గు గనుల సమ్మెల ద్వారా నాటి ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మంచిర్యాల, ఆసిఫాబాద్ కార్మిక శ్రేణులు, ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా నిలిచిన కరీంనగర్ పోరాట గడ్డల త్యాగాలు చారిత్రాత్మకమైనవని ప్యానల్ స్పష్టం చేసింది. ముఖాముఖి సంప్రదింపుల్లో పాల్గొన్న అత్యధిక శాతం మంది ఉద్యమకారులు సంక్షేమ పథకాల కంటే ముందే రెండు అత్యంత కీలకమైన డిమాండ్లను కమిటీ ముందు గట్టిగా లేవనెత్తారు. సుదూర ప్రాంతాలైన ఆసిఫాబాద్, మంచిర్యాల వంటి సరిహద్దు జిల్లాల నుండి వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఉద్యమకారులు హైదరాబాద్ దాకా రాలేకపోతున్నారని ప్రతినిధులు కమిటీ దృష్టికి తెచ్చారు. అందువల్ల, కమిటీ సభ్యులే స్వయంగా జిల్లాలకు వచ్చి క్షేత్రస్థాయిలో ఉండి నిజమైన ఉద్యమకారులను గుర్తించే పక్రియను చేపట్టాలని పట్టుబట్టారు. రెండు ప్రధాన డిమాండ్లతో పాటు, క్షేత్రస్థాయి యోధులు తమ ఇతర ఆత్మగౌరవ సంక్షేమ వినతులను కూడా కమిటీకి సమర్పించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి 250 గజాల నివాస స్థలం కేటాయించాలని,జీవన భృతి కోసం గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ అందించాలని,ఉద్యమకారుల పిల్లలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వీటితో పాటు మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక ప్రయోజనాలు, ఉచిత కార్పొరేట్ వైద్యం కోసం హెల్త్ కార్డులు, ఉచిత నాణ్యమైన విద్య, మరియు ఆర్టీసీ బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాల్సిందిగా వినతి పత్రాలు సమర్పించారు. ఉద్యమకారులు లేవనెత్తిన అంశాలపై కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు స్పందిస్తూ.. 'మీ ప్రతిపాదనలు వందకు వంద శాతం న్యాయమైనవి. ఈ అంశాలను సమగ్ర నివేదికలో చేర్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తక్షణమే తీసుకెళ్తామని అన్నారు. ప్రతి ఒక్క నిజమైన పోరాట యోధునికి న్యాయం జరిగేలా చూస్తాం' అని గట్టి భరోసా ఇచ్చారు. జూలై 22 వరకు ముఖాముఖి షెడ్యూల్ నిరంతరాయంగా కొనసాగుతుందని కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు ముగింపు ప్రసంగంలో స్పష్టం చేశారు.

# గొల్లప్రోలు, మూలపేట ఘటనలపై పవన్ సీరియస్

**సమగ్ర దర్యాప్తు జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోండి**
**కాకినాడ జిల్లా పోలీసులకు డిప్యూటి సిఎం పవన్ ఆదేశం**

**అమరావతి,జూలై16(జై భీమ్ న్యూస్):**

కాకినాడ జిల్లాలోని గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో జరిగిన ఘటనలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మద్యం మత్తులో, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా, సంబంధిత వ్యక్తుల భవిష్యత్తును కూడా అంధకారంలోకి నెడతాయని పేర్కొన్నారు. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో చోటుచేసుకున్న సంఘటనలే ఇందుకు నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఈ రెండు ఘటనలపై కాకినాడ జిల్లా పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సున్నితమైన ప్రాంతాలు గుర్తించి అవగాహన సదస్సులు నిర్వహించాలని పవన్ కల్యాణ్ సూచించారు. కాగా, కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఓ వ్యక్తితో కొంతమంది యువకులకు గొడవ జరిగింది. ఈ ఘటనలో పెదపూడి మండలం రామేశ్వరానికి చెందిన రాకేశ్ (25) అనే యువకుడు మృతిచెందాడు. తన అమ్మమ్మ వేమగిరి రమణమ్మ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బుధవారం మూలపేటకు రాకేశ్ వచ్చాడు. ఈ సందర్భంగా రాకేశ్ చెల్లి గ్రామంలోని ఓ దుకాణం వద్దకు వెళ్లగా, స్థానికంగా ఉన్న ఐదుగురు యువకులు ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధించారు. ఈ క్రమంలో తన అన్న రాకేశ్.. ఐదుగురు యువకులను మందలించాడు. వీరిలో వంశీ అనే యువకుడు కోపంతో రాకేశ్‌ను చాకుతో పొడవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గొల్లప్రోలు నగర పంచాయతీ రెండో వార్డు మాజీ కౌన్సిలర్ సంధ్య భర్త లింగం అర్జునుడు, తన స్నేహితులతో కలిసి దారపల్లి వాటర్ ఫాల్స్‌కు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన స్థానికుడు బచ్చల మారుతి పవన్ కల్యాణ్ అనే వ్యక్తితో అర్జునుడికి ఓ విషయంలో గొడవ జరిగింది. ఈక్రమంలో మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే అర్జునుడి కడుపులో బచ్చల మారుతి పవన్ కల్యాణ్ బలంగా పొడిచాడు. కత్తిపోట్లకు గురైన అర్జునుడిని పిఠాపురంలోని కార్తికేయ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అర్జునుడు ఆస్పత్రిలోనే మృతిచెందాడు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు జరపాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు.

# ఆక్వా రంగం బలపడడం జగన్‌కు ఇష్టం లేదు

**జగన్ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి యనమల**

అమరావతి,జూలై16(జై భీమ్ న్యూస్): జగన్ ఆక్వా రంగాన్ని పూర్తిగా నాశనం చేయాలని కోరుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మండిపడ్డారు. తద్వారా ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ప్రజలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేయాలన్నదే ఆయన ప్రధాన ఉద్దేశమని ఆరోపించారు. ఈ మేరకు ఆక్వా రంగంపై వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు గట్టిగా కౌంటర్ ఇచ్చారు. అంతర్జాతీయ మార్కెట్లు ఎప్పటికప్పుడు మారుతూ దేశీయ మార్కెట్‌పై చూపే గణనీయమైన ప్రభావాన్ని అర్థం చేసుకోవడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారని యనమల ఎద్దేవా చేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు సమగ్ర ఆర్థిక అభివృద్ధిని దెబ్బతీసి.. ఆంధ్రప్రదేశ్‌ను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన ఘనత జగన్‌దేనని యనమల దుయ్యబట్టారు. నాడు అధికారంలో ఉన్న సమయంలో ఆక్వా రంగానికి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు, రాయితీలను తొలగించడం ద్వారా ఈ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లు వృద్ధి చెందుతున్నప్పటికీ రాష్ట్రంలో ఆక్వా రంగం ఎందుకు భారీగా క్షీణించిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా జగన్ రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి అడ్డంకిగా మారకుండా, బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడిగా వ్యవహరించాలని యనమల హితవు పలికారు.

# పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

**ఆరోగ్యం, ఆపరేషన్‌పై గవర్నర్ ఆరా**
**త్వరగా కోలుకుని మళ్లీ విధుల్లోకి రావాలని ఆకాంక్ష**





**హైదరాబాద్,జులై16(జై భీమ్ న్యూస్):**

కుడి భుజానికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆంధప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లిన గవర్నర్.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శ అనంతరం గవర్నర్, పవన్ కల్యాణ్ నివాసంలోని లైబ్రరీని కూడా సందర్శించారు. అక్కడ రచయితలు, పరిశోధకులు, విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రచించిన పలు విలువైన పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలలోని అంశాలు, సమకాలీన సామాజిక, పరిపాలనా, ప్రజా విధానాలపై పవన్ కల్యాణ్‌తో గవర్నర్ ఆసక్తికరంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ అభ్యర్థన మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఒక పుస్తకంపై తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. ఈ ఆత్మీయ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. తన ఆరోగ్యాన్ని తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చి పరామర్శించిన గవర్నర్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్ చూపిన ఆప్యాయత, శుభాకాంక్షలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొద్దిసేపు పలు సమకాలీన అంశాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

# బలప్రదర్శనగా జగన్ పరామర్శలు

**విశాఖ మత్స్యకారుల పరామర్శలోనూ అదే తంతు**
**జగన్ తీరుపై మండిపడ్డ హోంమత్రి అనిత**

**విజయనగరం,జూలై16(జై భీమ్ న్యూస్):**

బాధితులను పరామర్శించడానికి వచ్చిన ప్రతిసారి జగన్ రెడ్డి బలప్రదర్శన చేస్తున్నారని ఆంధప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత దుయ్యబట్టారు. విశాఖపట్నం మత్స్యకారుల విషయాన్ని జగన్ అండ్ కో రాజకీయం చేయడానికి ప్రయత్నించి విఫలమైందని అనిత విమర్శించారు. వైసీపీ హయాంలో ఒక్క మత్స్యకారుడిని కూడా పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస ఘటనలో తప్పు ఎవరూ చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనను కూడా తాము సీరియస్‌గా తీసుకున్నామని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ నీచపు రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. గురువారం విజయనగరంలో హోం మంత్రి అనిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. బోటు గల్లంతైన వెంటనే ప్రభుత్వం స్పందించి నేవీ అధికారులకు సమాచారం అందజేసిందని తెలిపారు. వెంటనే 72 గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. జగన్ హయాంలో పోలీసులను వాడుకున్నారే తప్పా వారి సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోలేదని అనిత ప్రశ్నించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు పెండింగ్‌లోని పరిహారం చెల్లిస్తామని మాటిచ్చారు. జిందాల్ పరిశ్రమకు సంబంధించి రైతులకు కూడా పరిహార చెక్కులను వెంటనే చెల్లిస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# ముద్రగడ కూతురును అడ్డకోవడ ఏమిటి?

**వైకాపా నేతల తీరుపై మండిపడ్డ బుచ్చయ్య**

**రాజమహేంద్రవరం,జూలై16(జై భీమ్ న్యూస్):**

ముద్రగడను కడసారి చూసేందుకు వెళ్లిన ఆయన కుమార్తెను వైకాపా నేతలు అడ్డుకోవడం ఏంటని తెదేపా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రశ్నించారు. పరామర్శకు వైకాపా అధ్యక్షుడు జగన్ ర్యాలీగా వెళ్లడమేంటని ఆక్షేపించారు. ముద్రగడపై ప్రేమతో వెళ్లారా? రాజకీయ ప్రయోజనం కోసం వెళ్లారా? అని నిలదీశారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బుచ్చయ్యచౌదరి మాట్లాడారు. మత్స్యకారులు, ఆక్వా రైతులకు వైకాపా హయాంలో జగన్ ఏం చేశారో చెప్పాలని బుచ్చయ్యచౌదరి నిలదీశారు. బైక్‌తో ఢీకొట్టి ఒకరి మృతికి కారణమైన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడిని జగన్ వెనకేసుకుని రావడమేంటని ప్రశ్నించారు. ముద్రగడ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తుంటే మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైకాపా నేతలు అడ్డుకోవడంపై బుచ్చయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు బుద్ధి చెప్పినా వైకాపా నేతలకు బుద్ధి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి విలువైన ప్రాజెక్టులు తరలి వస్తున్నాయని గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రెండు స్టీల్‌ఎ÷-లాంట్‌లతో పాటు ఆటో మొబైల్, సెల్‌ఫోన్ కంపెనీలు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాలతో ముందు కెళ్తోందన్నారు. మంత్రి లోకేశ్ కృషితో విదేశాల నుంచి పరిశ్రమలు వస్తున్నాయని వివరించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# ప్రభాస్ ఫౌజీ డిసెంబర్ 3న లాక్

**రిలీజ్ డేట్‌తో పాటు పోస్టర్ విడుదల**




ప్రభాస్ హీరోగా వస్తోన్న ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఫౌజీ' సినిమా కోసం ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా టీమ్ వారికి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్ర విడుదల తేదీ ప్రకటించింది. డిసెంబర్ 3న 'ఫౌజీ' విడుదల కానున్నట్లు తెలుపుతూ ఓ కొత్త పోస్టర్ పంచుకుంది. 'అజ్ఞాతపర్వం ముగిసింది.. ఇక తిరుగుబాటు మొదలైంది..' అంటూ పంచుకున్న ఆ పోస్టర్‌లో '1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు' అని రాసి ఉన్న స్టాంప్ ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రభాస్ మునుపెన్నడూ చూడని లుక్‌లో కన్పించాడు. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి కూర్చొని ఉన్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ చివరి దశలో ఉంది. 75 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో మరో మూడు యాక్షన్ ఘట్టాలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించాల్సి ఉంది. ఇక ఈ సినిమా నుంచి త్వరలోనే ఓ లిరికల్ సాంగ్‌ను కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 'సీతారామం' తర్వాత ఫౌజీ కథను రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టిందని గతంలో హను రాఘవపూడి తెలిపారు. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మూడేళ్లుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా

**నన్ను ధైర్యంగా నిలబెట్టింది నా భార్యనే: అఖిల్**




మూడేళ్లుగా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని.. తన భార్య జైనబ్ వెన్నంటే ఉండి ధైర్యాన్ని ఇచ్చిందన్నారు నటుడు అఖిల్. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'లెనిన్' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరులో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి కృతజ్ఞతలు చెప్పిన అఖిల్ తన కుటుంబం గురించి మాట్లాడారు. నేను జైనబ్‌ను ఇంట్లో బంగారు తల్లి అని పిలుస్తాను. మూడేళ్లుగా నేను బాధలో ఉన్నప్పుడు నా పక్కనే ఉంటూ నన్ను ఎంతో సపోర్ట్ చేసింది. నాకు గైడ్‌లా ఉంటూ ధైర్యాన్నిచ్చింది. ఇక, లెనిన్ విడుదలైన అనంతరం జరిగిన ఈవెంట్‌లో నేను నాన్నను హగ్ చేసుకున్నాను. అందులోనే నేను పదేళ్లుగా దాచుకున్న ఎమోషన్స్ అన్నీ బయటకు వచ్చాయి. ఇన్నేళ్లలో నాన్న నన్ను ఒక్కసారి కూడా తిట్టలేదు. నిరుత్సాహపర్చలేదు. నాకు సర్వస్వం ఆయనే. ఒక స్నేహితుడిలా ఈ జర్నీలో తోడుగా ఉన్నాడు. 'లెనిన్'ను తన భుజాలపై మోశాడు. అక్కినేని అభిమానులకు మంచి సినిమాను అందించాలనే తపనతో వర్క్ చేశాడు' అని అఖిల్ చెప్పారు. ఇక అభిమానుల గురించి మాట్లాడుతూ.. 'ఎన్నో జన్మల పుణ్యం చేస్తే ఇలాంటి అభిమానులు దొరుకుతారు. ఫ్యాన్స్ కోసం అయినా హిట్ కొట్టాలని మా ఆవిడతో ఎప్పుడూ చెప్పేవాడిని. నన్ను నమ్మిన ప్రేక్షక దేవుళ్లందరికీ ఒక్కటే మాట చెబుతున్నాను. నేనేం కాలర్ ఎగరేయను.. విజయం సాధించాం అని గర్వపడను. ఇప్పటి నుంచి నా కొత్త ప్రయాణం మొదలవుతోంది. నేను చేయాలనుకుంటున్న యుద్ధాన్ని ప్రశాంతంగా చేస్తానని అన్నారు.

# నా ఫోటోలు తీయకండి ప్లీజ్: మౌనీరాయ్



బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.

# ఆగస్ట్ 15న రానున్న హుషారు పిట్టలు

అన్షు, వాసవి గణెళిషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్రక్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళు మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది. విడుదల తరువాత ఇతర భాషల్లో ఈ తెలుగు సినిమా గురించి మాట్లాడుకుంటారు. పుట్ట చిట్టి పాత్రకు వాసవి ప్రాణం పోసింది. అందుకే ఆమె కాళ్లు మొక్కుతున్నాను. ఈ రోజు మా కాన్ఫిడెంట్‌కు కారణం ఏమిటో ఈ సినిమా విడుదల తరువాత అందరికి తెలుస్తుంది' అన్నారు. హీరో అన్షు మాట్లాడుతూ.. నా ఫేవరెట్ సింగర్ మంగ్లీ నా సినిమాలో పాట పాటడం ఆనందంగా ఉంది. ఈ పాటకు మంచి ట్యూన్‌ను చరణ్ అర్జున్ అందించారు. ఈ రోజు నా ఆత్మవిశ్వాసానికి కారణం దర్శకుడు బిక్షు, నిర్మాత వెంకట్. టీజర్ విడుదల చేశాం. చాలా వైరల్ అయ్యింది. టీజర్ చూసి అందరూ మిస్ అండర్ స్టాండింగ్ చేసుకున్నారు. సినిమా చూసిన తరువాత అందరి ఆలోచన మారిపోతుంది. సినిమాలో అసలైన మ్యాటర్ సినిమాలో ఉంది. నా సినిమాలో ఉన్న కంటెంట్ నాతో ఇంత కాన్ఫిడెన్స్‌ను ఇచ్చింది' అన్నారు. హీరోయిన్ వాసవి గణెళిషన్ మాట్లాడుతూ.. దర్శకుడు, నిర్మాత సజేషన్‌తో ఈ సినిమా చేశాను. సురేష్ ప్రొడక్షన్స్, బెక్కెం వేణుగోపాల్ సహకారంతో ఈ సినిమా స్టాం÷-రగ్ అయ్యింది. టోంగా.,. టోంగా పాట అందరికి నచ్చుతుంది. ఈ సినిమా టీజర్‌తో నాకు చాలా నెగెటివ్ కామెంట్స్ పెట్టారు. అయితే వాసవి గణెళిషన్ వేరు? పుట్ట చిట్టి వేరు.. ఎవ్వరూ ఏమనుకున్నా సినిమా చూసిన తరువాత మీరు కూడా అర్థం చేసుకుంటారని అనుకుంటున్నాను' అన్నారు.







# 23న జననాయగన్ రిలీజ్... పోస్టర్ విడుదల

తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఆఖరి చిత్రం 'జన నాయగన్'. ఈ ఏడాది సంక్రాంతికే థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రం సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ చిత్రాన్ని ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ మేరకు ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. 'అగ్ని పరీక్షలో నిలిచి.. కాలం మలిచిన రూపం.. పోరాటం ఎంత కఠినంగా ఉంటే.. విజయం అంత ఘనంగా ఉంటుంది' అనే వ్యాఖ్యల్ని జోడించింది. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలకపాత్రలో నటించింది.